క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ


ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు ప్రతి ఆదివారం చేపట్టే రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ కొనసాగింది. వైఎస్‌ఆర్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులు, రోగులతోపాటు సహాయకులకు రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భారతి, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

రూ. 4 లక్షలతో విశ్రాంతి సత్రం ఏర్పాటు


ప్రజల సౌకర్యార్థం నిర్మించిన సత్రం

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దండె వెంకటశేషరెడ్డి రూ. 4 లక్షల సొంత నిధులతో విశ్రాంతి సత్రాన్ని నిర్మించారు. ప్రజల సౌకర్యార్థం తన వంతుగా సత్రాన్ని ఏర్పాటు చేశానని దండె వెంకటశేషిరెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సత్రాన్ని ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.69 లక్షలు

బనగానపల్లె: పట్టణంలోని ముస్లిం మైనార్టీ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.69 లక్షలు సీఎండీఎఫ్ నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈఈ నాగశ్రీనివాసులు తెలిపారు. టెండర్లు పూర్తి అయ్యాయని, త్వరలో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

మహాసభ నియోజకవర్గ కన్వీనర్‌గా మద్దయ్య

బనగానపల్లెరూరల్: అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్‌గా జ్వాలాపురం గ్రామానికి చెందిన మద్దయ్యయాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో అఖిల భారత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు శేషఫణి, నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కృష్ణయ్య, నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ ఎన్నిక సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని మద్దయ్య యాదవ్ తెలిపారు.

నేడుకన్యకాపరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవం

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పెండేకంటి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పంచసూక్త హోమం, కుంకుమార్చన, 108 మంది ఆర్యవైశ్య మహిళలతో దీపాలంకరణ ఊరేగింపు, అమ్మవారి నిజస్వరూప ప్రదర్శన తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి సాయి బాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



బేతంచెర్ల: కర్నూలు రహదారిలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవ వేడకలు ఈనెల 23, 24 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కృపాధామ్ కమిటీ సభ్యులు తెలిపారు. 23న బాబాకు ఉదయం 7:30 నుంచి సచ్చరిత్ర పారాయణం , సాయంత్రం 3 గంటల నుంచి గ్రామోత్సవం ఉంటుందన్నారు. అదేవిధంగా 24న ఉదయం 5గంటలకు మందిర సంకీర్తన, 6 గంటలకు కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకం, మహా మంగళహారతి నిర్వహిస్తామన్నారు. 7: 30 గంటల నుంచి బాబా నిజపాదదర్శనం ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యారంగానికి పెద్దపీట

- నాడు– నేడుతో సర్కారు బడుల రూపురేఖలు మారాయి
- గ్రామీణ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసి బడ్జెట్‌లో రూ. 54వేల కోట్లు ఖర్చు చేసిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణ శివారులోని గురుకుల పాఠశాల 39వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్దౌస్ అంజుమ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినులకు విద్యనందించేందుకు 1984లో ఇక్కడ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎంతో మంది విద్యార్థినులు ఇక్కడ విద్యనభ్యసించి ఉన్నత ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గ్రామీణ విద్యార్థులు ఆణిముత్యాలుగా రాణిస్తున్నారన్నారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు– నేడు మనబడి కార్యక్రమాన్ని అమలు చేసి సర్కారుబడుల రూపురేఖలు మార్చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని హంగులతో నిర్మించి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. పేద పిల్లల విద్యాభివృద్ధే లక్ష్యంగా అమ్మఒడి, విద్యాకానుక, విద్యా, వసతి దీవెనలు తదితర పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రూ. 80 కోట్లతో పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే కాటసాని పిలుపునిచ్చారు. గురుకుల పాఠశాలల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ ఉన్నత హోదాల్లో పనిచే స్తున్నారన్నారు. కోవెలకుంట్ల గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులను ప్రవేశ పెట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో 91శాతం, పదవ తరగతిలో 89 శాతం విద్యార్థినీలు ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు, ఉపాధ్యాయినీలు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, గురుకుల పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, ఎంఈఓ తిమ్మారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్, ఉమామహేశ్వరయ్య, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు రాజా నారాయణమూర్తి ప్రమాణ స్వీకారం



ప్యాపిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రాజా నారాయణమూర్తి సోమవారం డోన్ పట్టణంలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పార్టీకి అందించిన సేవలకుగాను రాజా నారాయణమూర్తికి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి వరించడంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు డోన్‌కు తరలివెళ్లనున్నారు.

దివ్యాంగ సారథి పథకాన్ని అమలు చేయాలి

బేతంచెర్ల: దివ్యాంగులకు దివ్యాంగ సారథి పథకాన్ని అమలు చేయాలని మండల స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, రాముడు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2017లో కేంద్ర ప్రభుత్వం దివ్యాంగ సారథి యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్యం, రాయితీతో కూడిన రవాణా సేవలు, ఆర్థిక చేయూత, విదేశీ విద్య, కృత్రిమ అవయవాలు అందజేత తదితర సేవలను సులభంగా పొందవచ్చన్నారు. ఈ విషయంపై అధికారులు దివ్యాంగులకు అవగాహన కల్పించాలని కోరారు.

నేడు మంత్రి బుగ్గన రాక



బేతంచెర్ల: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నేడు బేతంచెర్లకు రానున్నారని, , సోమవారం, మంగళవారం డోన్, బేతంచెర్ల మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆదివారం తెలిపారు. 23వ తేదీన ఉదయం 9.30 గంటలకు బేతంచెర్ల పట్టణంలోని అల్లబకాష్ దర్గా సమీపాన రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. అనంతరం డోన్ పట్టణంలో 11:30 గంటలకు జరిగే మార్కెట్ యార్డు నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారన్నారు. సాయంత్రం 3 గంటలకు బుక్కాపురం గ్రామంలో రూ. 42 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించి నూతన రహదారిపై గ్రామంలోకి పాదయాత్రగా వెళ్తారన్నారు. అదేవిధంగా 24వ తేదీన ఉదయం 9:30 గంటలకు గొరిపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో రూ.1.50 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమంలో మంత్రి బుగ్గన పాల్గొంటారన్నారు. ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరించాలి


ముస్లిం విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న మత పెద్దలు

కోవెలకుంట్ల: మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించి ఇస్లాం మత సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆ మత నంద్యాల జిల్లా ముక్తి రఫీ సూచించారు. ఆదివారం మండల కేంద్రం సంజామలలో ఇస్లాం విద్యపై కోవెలకుంట్ల, సంజామల మండలాలకు చెందిన ముస్లిం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మత పెద్దలు అక్రం, అన్వర్ మౌలానా, అబ్దుల్ రహీమ్, షంషుద్దీన్, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక మత పెద్దలు నబీ రసూల్, యూసఫ్ ఉసేన్, తదితరులు పాల్గొన్నారు.

యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు


పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న కాటసాని రామిరెడ్డి దంపతులు

బనగానపల్లెరూరల్: శ్రీశైల క్షేత్రంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 17వ తేదీ నుంచి మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అతిరుద్రయాగంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ దంపతులు ఆదివారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలనే కోరుతూ ఈ యాగంలో పాల్గొన్నట్లు తెలిపారు.

ఎంపీడీఓ, సచివాలయ భవనాలు ముస్తాబు


రూ.1.20కోట్ల నిధులతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం


40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-2 భవనం

- 25న ప్రారంభించనున్న ఎమ్మెలే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: స్థానిక ఎంపీడీఓ, గ్రామ సచివాలయం -2 కార్యాలయ భవనాలు ముస్తాబయ్యాయి. రూ.1.20కోట్లు, రూ.40లక్షలతో నిర్మించిన ఈ భవనాలను 25వ తేదీన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశామని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. అదేవిధంగా రూ.40లక్షలతో ఏర్పాటు చేసిన స్టేట్‌బ్యాంకు రోడ్డును జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొంటారని చెప్పారు

పేదలను ఆదుకోవాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్యాపిలి: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక జగనన్న కాలనీలో ఆదివారం నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని వస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయం చాలడం లేదన్నారు. లబ్ధిదారుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రంగనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, నాయకులు పిక్కిలి వెంకటేశ్, పులిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం


బెల్ట్ గ్రేడింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

డోన్ టౌన్: కరాటేతో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతుదని ఒలంపిక్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు అన్నారు. రామ్స్ స్కూల్ అఫ్ కరాటే మాస్టర్ రమణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక షాదీఖానాలో ఏర్పాటు చేసిన బెల్ట్ గ్రేడింగ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గుర్తించిన క్రీడల్లో కరాటే ఒక్కటి అని, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఉపకరిస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల ప్రతిభ ప్రకారం బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎండీ బాషా తదితరులు పాల్గొన్నారు.

కళాశాల రుణం తీర్చుకుందాం


ఆలనాటి గురువులతో పూర్వవిద్యార్థులు

- గుండాల వెంకటరత్నం శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థులు
- నలభైఏళ్ల తర్వాత అపూర్వకలయిక
- కళాశాల అభివృద్ధికి పాటుపడుతామంటూ ప్రతిన

డోన్ : స్థానిక గుండాల వెంకటరత్నం శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల (1978 – 1986) అపూర్వ కలియక ఆదివారం ఉల్లాసంగా జరిగింది. దాదాపు నలభైఏళ్ల తర్వాత కలిసిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలియకతో కళాశాల ఆవరణలో పండుగవాతావరణం నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేట్, వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిరపడిన స్నేహితులు యోగక్షేమాలు తెలుసుకుని సంబురపడ్డారు. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థి సంఘం నేతలు ఆలంకొండ నబీ, జయచంద్రారెడ్డి, సీఐ గౌస్, కొండా సురేష్, రామాంజనేయులు, వరిగడ్డి వెంకటేశ్వర్లు, ఆలా మోహన్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులు కళాశాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు. మన అభ్యున్నతికి దారిచూపిన కళాశాల అభివృద్ధికి అన్నివిధాలుగా పాటుపడుతామని పూర్వవిద్యార్థులు ప్రతినబూనారు.

గురువులకు సన్మానం

విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురువులు సోమశేఖర శర్మ, శివారెడ్డి, ఏకాంతరెడ్డి, కళావతి, మల్లికార్జునప్ప, ప్రస్తుత కళాశాల ప్రిన్సిపాల్ భారతి తదితరులకు శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం గురువులకు పాదాభివందనంచేసిఆశీర్వాదాలు తీసుకున్నారు. అంతకుముందు.... మృతిచెందిన గురువులు, పూర్వ విద్యార్థులకు సంతాపం తెలిపారు.

సంపూర్ణ సహకారం అందజేస్తా



కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తాం. త్రీ ఫేస్ విద్యుత్ కనెక్షన్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. ల్యాబ్‌ను విద్యార్థులకు పూర్తి అందుబాటులోకి తెస్తాం. అవసరమైతే కళాశాల విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించి పూర్వ వైభవం తెచ్చేందుకు కలిసికట్టుగా ప్రయత్నిస్తాం.

– ఎస్. ఎం.డి. గౌస్, రామగిరి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం జిల్లా.

అంతులేని ఆనందం



యాభైఏళ్ల తర్వాత అందరం ఒకచోట కలవడం అంతులేని ఆనందాన్ని కలిగిస్తుంది. అలనాటి గురువులను చూసి పలకరించడం మరువలేని అనుభూతి. కళాశాల పూర్వ వైభవానికి ఆర్థిక తోడ్పాటునందించడం బాధ్యత. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అత్యుత్తమమైన విద్యను అందించడమే మా ధ్యేయం.

–: ఐ.ఆర్. విజయభాస్కర్, అసిస్టెంట్ కమిషనర్, జీఎస్టీ, తిరుపతి

బాధ్యతగా అభివృద్ధికి పాటుపడుతాం



తమకు విద్యాబుద్ధులు నేర్పించి ఎంతో ఉన్నత స్థితికి చేర్చిన డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోవడం బాధాకరం. కళాశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చే కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా అందరం సమష్టిగా కృషి చేస్తాం.

–: నబీ సాహెబ్, పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు, డిగ్రీ కళాశాల, డోన్.

ఇదో గొప్ప అవకాశం



చదువులు నేర్పిన కళాశాల రుణం తీర్చుకునేందుకు వచ్చిన గొప్ప అవకాశం. వృత్తిరీత్యా ఉన్నత స్థానంలో ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినా తగిన తృప్తి కలగలేదు. తమకు చదువు నేర్పిన కళాశాలలో నిరంతర సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఎంతవరకైనా ఆర్థిక తోడ్పాటు అందించేందుకు సిద్ధం. – ప్రసూన, డిప్యూటీ సెక్రటరీ, ఏపీపీఎస్సీ, విజయవాడ.

కళాశాల అభివృద్ధికి సహకారం



ఒకప్పుడు ఇక్కడ విద్యను అభ్యసించి ప్రస్తుత పరిస్థితులు చూస్తే ఆవేదన కలుగుతుంది. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రణాళికను తయారు చేస్తాం. అధ్యాపకుల సహాయంతో అమలు చేస్తాం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తాం. – పుల్లయ్య, జిల్లా రెవెన్యూ అధికారి, నంద్యాల.

తీరుతున్న చెంచుల సమస్యలు!

- విద్యుత్, నీటి సౌకర్యం కల్పించిన అధికారులు
- రోడ్డు ఏర్పాటుకూ ప్రతిపాదనలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గూడెం ప్రజలు


కొండపై ఉన్న చెంచుగూడెం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బి.తాడిపత్రి సమీపంలోని కొండపై ఉన్న చెంచుగూడెం ప్రజల సమస్యలు ఒక్కొక్కటిగా తీరుతున్నాయి. చెంచులకు మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. దాదాపు 80 ఏళ్ల నుంచి 35 కుటుంబాలు జనజీవనానికి దూరంగా కొండపై అక్కడే ఉన్న రాళ్లతో చిన్న గుడిసెలు నిర్మించుకుని కనీస సౌకర్యాలు కరువై అంధకారంలో జీవనంసాగిస్తూ వచ్చారు. కనీసం విద్యుత్, తాగునీటి సౌకర్యం లేక పోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చెంచుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. బి.ఉప్పలూరు నుంచి గూడెం వరకు 12 స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. నీటి సౌకర్యం లేక ఏళ్ల తరబడి నుంచి పడరాని పాట్లు పడుతుండేవాళ్లు. కొండలో పారే నీటితో కాలం వెళ్లదీసేవాళ్లు. ఇంకిపోతే సమీపంలోని రైతుల పొలాల వద్ద ఏర్పాటు చేసిన మోటార్ల నుంచి బిందెలతో నీటిని అష్టకష్టాలుపడి తీసుకెళుతుండేవారు. కొన్ని దశాబ్దాలుగా చెంచులు ఇబ్బంది పడిన నీటి సమస్యకు పరిష్కారం చూపారు. గూడెం సమీపంలో బోరు వేసి మోటార్ అమర్చి నీటి సౌకర్యం కల్పించారు. అదేవిధంగా బి తాడిపత్రి నుంచి గూడెం వరకు రాక పోకలు సాగించాలంటే చాలా వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. రైతుల పొలాలకు వెళ్లె దారిలో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించేవారు. ఇక వర్షాకాలంలో రాకపోకల కష్టాలు వర్ణనాతీతం. గూడెం వరకు రోడ్డు నిర్మాణంలో భాగంగా కొంత భాగం సీసీ రోడ్డు నిర్మించి మిగిలినది గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు ఇటీవల పీఆర్ అధికారులు అంచనాలు తయారు చేశారు. కొన్నేళ్ల నుంచి నెలకొన్న ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతుండటంతో చెంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతులకు చెంచులు కృతజ్ఞతలు తెలిపుతున్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష


శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాణ్యం: కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపికకు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కట్టుదిటమైన భద్రత మధ్య ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష నిర్వహించారు. పాణ్యం మండల పరిధిలోని పరీక్ష కేంద్రాలను నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి, ఏఎస్పీ రమణ, డీఎస్పీలు తనిఖీ చేశారు. చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మొత్తం 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్, కాపియింగ్, తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. 17, 331మంది పరీక్ష రాయాల్సి ఉండగా అందులో 1092 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. కాగా పాణ్యం మండలం నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ, ఆర్‌జీఎం, విజయానికేతన్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు నిర్వహించారు. సీఐ వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు, ప్రీతమ్‌రెడ్డి ఎస్‌ఐలు సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య ఆయా కేంద్రాల వద్ద బందోబస్త్ నిర్వహించారు.